క్లుప్తంగా

మహిళల భద్రతకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న మహిళా స్టేషన్ శక్తి టీమ్

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో మహిళలు, యువతులు, బాలికలు, విద్యార్థినులు అత్యవసర పరిస్థితుల్లో శక్తి యాప్‌ను వినియోగించుకోవాలని మహిళా స్టేషన్ ఎస్సై క్రాంతిప్రియ సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో, ఏదైనా అపాయం వస్తే వెంటనే శక్తి యాప్‌ను వినియోగించాలని, లేదా 112 టోల్ ఫ్రీ నెంబర్ లేదా 79934 85111కు ఫోన్ చేయాలని కోరారు. ఏలూరులో శక్తి పోలీస్ టీమ్‌తో కలిసి పార్కులు, మహిళలు అధికంగా ఉండే ప్రాంతాలు, విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్నారు. శక్తి యాప్‌లో ఎస్‌ఓఎస్ అలర్ట్‌తో తక్షణమే పోలీస్ సహాయం అందుతుందని తెలిపారు. ఈ సందర్భంగా సమాజంలో ప్రజలకు ఇబ్బందులకు గురిచేసే ప్రతి విషయంలోనూ మహిళలకు అవగాహన కల్పిస్తున్నారు.

'తల్లికి వందనం' వారికే ఇవ్వాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మాత్రమే వర్తింపజేయాలని పీఆర్‌టీయూ నాయకులు ఎమ్మెల్యే బడేటి చంటిని కోరారు. ఈ మేరకు శనివారం చంటి క్యాంపు కార్యాలయంలో కలుసుకున్న పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వల ఆంజనేయులు బంధింత వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మాత్రమే ఈ పథకాన్ని వర్తింప చేస్తే ప్రభుత్వ పాఠశాలలు పరిరక్షించబడతాయన్నారు. పాఠశాలలు పునః ప్రారంభమౌతున్న ఈ సమయంలో సొమ్ము జమ అవుతుండడం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికపై ప్రభావం చూపుతుందన్నారు. ప్రభుత్వ విధానాల ప్రకారం అంతగా ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులను కూడా ప్రోత్సహించాలనుకుంటే వారికి రూ. 5 వేలు చొప్పున జమ చేసి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని కోరారు.

చింతలపూడి ఎక్స్‌ప్రెస్ బస్సును పునరుద్ధరించండి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు నుంచి చింతలపూడికి వెళ్లేందుకు ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసును పునరుద్ధరించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వల ఆంజనేయులు ఆర్టీసీ విజయవాడ జోన్ చైర్మన్ రెడ్డి అప్పల నాయుడును కోరారు. శనివారం అప్పల నాయుడును ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసిన ఆంజనేయులు చింతలపూడి రూట్‌లో లిమిటెడ్ హాల్ట్స్‌తో కూడిన ఎక్స్‌ప్రెస్ బస్ సర్వీసు వేస్తే ఏలూరు నుంచి ఉదయం పాఠశాలలకు వెళ్లే ఉద్యోగ, ఉపాధ్యాయులకు సమయం కలిసివస్తుందన్నారు. దీనిపై అప్పల నాయుడు స్పందించి ఆర్టీసీ అధికారులతో చర్చించి సర్వీసు ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

రక్తదాతలకు సలామ్

- రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో సత్కారం
- రోగులు, క్షతగాత్రులకు భరోసా
- తలసేమియా చిన్నారులకు అండగా



రక్తదానంలో రెడ్‌క్రాస్ ప్రతినిధులు

ఏలూరు టౌన్: ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి రక్తదానం చేయటం ప్రాణదానం చేయటమే. రోడ్డు ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులకు, శస్త్ర చికిత్స చేయించుకునే రోగులు, క్యాన్సర్, సికిల్ సెల్, ఎనీమియా, డయాలసిస్ వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు, తలసేమియా చిన్నారులు ఇలా నిత్యం ఎంతోమంది ప్రాణాలను నిలబెడుతున్న రక్తదాతలకు సలామ్. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏలూరు రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ ఎంబీఎస్‌వీ ప్రసాద్ ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ కార్యదర్శి బెన్నీ, డాక్టర్ వరప్రసాదరావు, సభ్యులు ఆలపాటి నాగేశ్వరరావు, ఎయిడ్స్ కంట్రోల్ క్లస్టర్ మేనేజర్ బాలాజీ, ఎం చంద్రశేఖర్, అజయ్‌బాబు, శ్రీరామరాజు రక్తదాతలను ఘనంగా సత్కరించారు.

అందుబాటులో రక్త నిల్వలు

ఏలూరు జిల్లాలో ప్రతి రోజూ అనేకమంది రోగులు, క్షతగాత్రులు, తలసేమియా చిన్నారులకు ప్రాణధారమైన రక్తాన్ని అందిస్తూ రెడ్‌క్రాస్ అండగా నిలబడుతోంది. ఏలూరు రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో 170 మందికి పైగా తలసేమియా చిన్నారులకు ప్రతి వారం రక్తమార్పిడి చికిత్స అందిస్తున్నారు. ఏలూరు నగరంలోనే ప్రతి రోజూ సుమారుగా 50 యూనిట్ల రక్తం అందిస్తూ రెడ్‌క్రాస్, ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్‌లు తమ సేవలు అందిస్తున్నాయి. రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ ఎంబీఎస్‌వీ ప్రసాద్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తూ రక్తనిల్వలను ప్రజలకు అందుబాటులో ఉంచుతున్నారు.

ప్రాణదాతలు వీరే

ఏలూరు వన్‌టౌన్ ప్రాంతానికి చెందిన బావిశెట్టి చిరంజీవిరావు గత దశాబ్దకాలంగా 106 సార్లు రక్తదానం చేసి అందరికీ స్ఫూర్తిప్రదాతగా నిలిచారు. ఆయన సేవలకు రాష్ట్ర స్థాయిలో రెడ్‌క్రాస్ సొసైటీ అవార్డు దక్కింది. వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ చేతులమీదుగా అవార్డును శనివారం అందుకున్నారు. 88 సార్లు రక్తదానం చేసిన ప్రభుత్వ జూనియర్ కాలేజీకి చెందిన యూటీఎఫ్ శ్రీనివాసరావును రెడ్‌క్రాస్ సొసైటీ శనివారం ఘనంగా సత్కరించింది. బోటనీ అధ్యాపకుడు కానుకొల్లు రాజేష్‌కుమార్ 97 సార్లు రక్తదానం చేసి తన సేవాగుణాన్ని చాటుకుంటున్నారు. వీరంతా తమ విధులను నిర్వర్తిస్తూనే ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో రక్తదానం చేస్తూ ప్రాణదాతలుగా నిలుస్తున్నారు.



106 సార్లు రక్తదానం చేసి రాష్ట్ర అవార్డు అందుకుంటున్న చిరంజీవిరావు



88 సార్లు రక్తదానం చేసిన యూటీఎఫ్ శ్రీనివాసరావును సత్కరిస్తున్న దృశ్యం



97 సార్లు రక్తదానం చేసిన కానుకొల్లు రాజేష్‌కుమార్

796 మందికి రక్తదానం



ఏలూరు యూత్ బ్లడ్ డోనర్స్ వాట్సాప్ గ్రూప్ ద్వారా అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారికి గత పదేళ్లుగా 796 మందికి రక్తదానం చేయటం సంతోషంగా ఉంది. ఏలూరుకు చెందిన యువతను రక్తదానం చేసేలా ప్రోత్సహిస్తున్నాం. రక్తదానం చేయటం ద్వారా ఎలాంటి నష్టం లేదని అవగాహన కల్పిస్తున్నాం. తమకు అండగా నిలిచిన రక్తదాతలకు కృతజ్ఞతలు చెబుతున్నారు.

– వైఎస్‌వీ శివరావు,
జేసీఎస్ కన్వీనర్, ఏలూరు

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

సైన్ బోర్డులు, లైటింగ్ ఏర్పాటు



జాతీయ రహదారిపై లైటింగ్ ఏర్పాటు చేస్తున్న పోలీస్ సిబ్బంది

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లాలోని జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణకు ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. తరచు రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్న ప్రాంతాల్లో నివారణ చర్యలకు ఆదేశాలు జారీ చేశారు. ఏలూరు జాతీయ రహదారిపై నగర శివారు ఆశ్రం బ్రిడ్జి, వ్యాసకాని రైల్వే బ్రిడ్జి ప్రాంతాల్లో ఇటీవల బస్సులు రోడ్డు ప్రమాదాలకు గురయ్యాయి. ఆయా ప్రాంతాల్లో రాత్రి వేళ లైటింగ్ లేకపోవటాన్ని గుర్తించి విద్యుత్ దీపాలు, సైన్ బోర్డులు, హెచ్చరిక బోర్డులు పెట్టి వాహనదారులకు ప్రమాద హెచ్చరిక సూచీలను ఏర్పాటు చేశారు. శనివారం ఆయా ప్రాంతాల్లో సోలార్ స్ట్రీట్ లైట్స్ – 7, హెచ్చరిక సైన్ బోర్డులు – 4, స్పీడ్ లిమిట్ హెచ్చరిక బోర్డులు – 10 ఏర్పాటు చేశారు. వాహనదారులు మితిమీరిన వేగంతో ప్రయాణించవద్దని, వేగం కంటే ప్రాణం విలువైందని సూచించారు.

విమాన ప్రమాద మృతులకు సంతాపం



మృతులకు సంతాపం వ్యక్తం చేస్తున్న వైఎంహెచ్‌ఏ ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): అహ్మదాబాద్‌లో ఇటీవల ప్రమాదంలో నేల కూలిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంలో మృతి చెందిన వారికి నగరానికి చెందిన హిందూ యువజన సంఘం సంతాపం తెలిపింది. శనివారం స్థానిక వైఎంహెచ్‌ఏ హాలులో ఏర్పాటు చేసిన సభలో తొలుత సంఘ సభ్యులు మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాల పాటు మౌనం పాటించి, అంజలి ఘటించారు. ఈ సందర్భంగా సంఘ మేనేజ్మెంట్ కమిటీ అధ్యక్షుడు యర్రా సోమలింగేశ్వరరావు మాట్లాడుతూ ఎవరు ఊహించని ఘోర ప్రమాదమని, మరణించిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని కోరుతున్నామని చెప్పారు. మృతులకు సంఘ ఉపాధ్యక్షుడు ఎంవీపీఎస్ నాగేశ్వరరావు, వేమా కోటేశ్వరరావు, ఇన్‌చార్జి ప్రధాన కార్యదర్శి గుడిపాటి లలితా శర్మ, సహాయ కార్యదర్శి సీహెచ్ సాయి తేజ, సభ్యులు శలా రాజాబాబు, రేవూరి శివశంకర వరప్రసాద్, ప్రత్యేక ఆహ్వానితులు వేణుగోపాల్ లునాని, కార్యనిర్వాహక కమిటీ అధ్యక్షుడు యిరదల ముద్దుకృష్ణ, ఉపాధ్యక్షుడు ఎల్ వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి మజ్జి కాంతారావు, కేబీ రావు, బొప్పన వెంకట రాజా, కె.హేమంత్ కుమార్, ఎ.పార్వతి రామచంద్రన్, ఎం సూర్యనారాయణ, పిలగల కొండలరావు, ఇ.హేమసుందర్, ఎంవీ రవీంద్ర, మారం హనుమంతరావు నివాళులర్పించారు.

ఆరోగ్య ప్రదాయిని యోగా



యోగా కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రతి రోజూ యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. యోగాంధ్ర 2025 కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం స్థానిక వట్లూరులోని టీటీడీసీలో సన్నాహక సామూహిక యోగా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు పలువురు జిల్లా అధికారులు, ఉద్యోగులు యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 21వ తేదీ అంతర్జాతీయ యోగా దినోత్సవం నాటికి ప్రజలందరికీ యోగా ప్రాముఖ్యతను తెలియజెప్పి, యోగాను వారి జీవనశైలిలో భాగస్వామ్యం చేసే లక్ష్యంతో ప్రభుత్వం నెల రోజుల పాటు యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా శనివారం అన్ని గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో సన్నాహక సామూహిక యోగా కార్యక్రమం నిర్వహించినట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జూన్ 21న విశాఖపట్నం బీచ్ ఒడ్డున నిర్వహించే కార్యక్రమంలో ప్రధాని, రాష్ట్ర వ్యాప్తంగా రెండు కోట్ల మంది పాల్గొనే విధంగా ఏర్పాట్లు చేస్తోందన్నారు. జిల్లాలో యోగాంధ్రలో భాగస్వాములు అయ్యేందుకు ఇంతవరకు 8,50,189 మంది పౌరులు యోగాంధ్ర యాప్‌లో నమోదయ్యారన్నారు. జూన్ 18న కామవరపు కోట మండలం గుంటుపల్లి బౌద్ధారామంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించనున్నటుతెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ ఆర్ విజయరాజు, ఏలూరు ఆర్డీవో అచ్యుత అంబరీష్, ఆయుష్ డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మీ సుభద్ర, డీఎల్‌డీఓ లక్ష్మి, తహసీల్దార్ జీవీ శేషగిరి, సోషల్ వెల్ఫేర్ గురుకుల విద్యాలయాల ప్రిన్సిపల్ డి. మేరీ ఝాన్సీరాణి, సెర్ప్ కింద ఉపాధి శిక్షణ పొందుతున్న యువతలు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.1.85 లక్షల విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి ఒక భక్తుడు శనివారం రూ.1,85,000 విరాళంగా అందజేశారు. కామవరపుకోట మండలం తాడిచర్లకు చెందిన గుల్లా మంగరాజు దంపతులు ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. దాతకు ఆలయ ఈఓ ఎన్‌వీ సత్యన్నారాయణ మూర్తి విరాళం బాండ్ పత్రాన్ని అందించి అభినందించారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	28	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	70
వంకాయలు (కాంతులు)	34	బీన్స్‌చిక్కుడు	--
వంకాయలు (తెలుపు)	30	చామదుంపలు	48
బెండకాయలు	24	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	30	కంద	--
కాకర కాయలు	46	బీట్‌రూట్	36
బీరకాయలు	30	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	44	ఫ్రెంచ్‌బీన్స్	90
క్యాబేజీ	22	అల్లం	64
క్యారెట్	36-45	కొత్తిమీర (కట్ట)	25
దొండకాయలు	20	పాలకూర	12
బంగాళదుంపలు	30	తోటకూర	10
ఉల్లిపాయలు	27	చుక్కకూర	12
గోరుచిక్కుడు	38	గోంగూర	07-10
దోసకాయలు	20	పుదీనా	05
ఆనబకాయ (1)	10-15	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	05
ఏలూరు - జీడిమెట్ల (ఖమ్మం) (ఇంద్ర)	20.15	00
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	14
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	08
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	01
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	05
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	06
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	00
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	00
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	01
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	08
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.00	98516	37
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.40	98507	37
ఏలూరు - తిరుపతి	16.00	4830	33

రథయాత్ర నగర ప్రజల అదృష్టం



రథయాత్ర వాల్ పోస్టర్ విడుదల చేసిన ఎమ్మెల్యే చంటి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలో పూరి జగన్నాథుని రథయాత్ర నిర్వహించడం నగర ప్రజల అదృష్టమని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. జూలై 1వ తేదీన అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో నగరంలో నిర్వహించనున్న పూరి జగన్నాథుని రథయాత్రకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను చంటి శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇస్కాన్ ఆధ్వర్యంలో మూడోసారి పూరి జగన్నాథుని రథయాత్ర నిర్వహించనుండడం ఆహ్వానించదగ్గ పరిణామమన్నారు. ఈ యాత్రలో నగర ప్రజలంతా భాగస్వాములై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఇస్కాన్ ఏలూరు మంది అధ్యక్షుడు రాధావల్లభ దాస్, ప్రతినిధులు ప్రశాంత్, రూపమయ కిషోర్ దాస్, రామనామదనదాస్, నంద కిషక్టర్, అంకిత్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు పోడు పట్టాలివ్వాలి

కుక్కునూరు: విలీన మండలాల్లో పోడు నరికి సాగు చేసుకుంటున్న గిరిజనులకు పోడు పట్టాలివ్వాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో శనివారం కుక్కునూరు ఫారెస్ట్ రేంజర్ కృష్ణకుమారికి వినతిపత్రం అందించారు. ఎన్నో ఏళ్లుగా పోడుభూముల పైన ఆధారపడి జీవిస్తున్న గిరిజన రైతులకు పట్టాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే పట్టాలివ్వాలని కోరారు.

పారిజాతగిరికి పోటెత్తిన భక్తులు

జంగారెడ్డిగూడెం: స్థానిక పారిజాతగిరి శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయానికి శనివారం భక్తులు అధిక తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. స్వామి వారికి సుప్రభాత సేవ మొదలుకుని తోమాల సేవ, తీర్థప్రసాద గోష్ఠి, ఆరాధన, బాలభోగ నివేదన తదితర పూజలు అర్చకులు నల్లూరి రవికుమారాచార్యులు ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. కాగా, ఆలయ గిరి ప్రదక్షిణ సిమెంట్ రోడ్డుకు ఇరువైపులా దాతలు దమ్మపేటకు చెందిన వల్లభ నర్సరీ, శ్రీ లక్ష్మీనరసింహ నర్సరీ, సాయి కృష్ణ నర్సరీ, నరసన్నపాలెంకు చెందిన శ్రీ ప్రకృతి క్లోన్స్ యాజమాన్యం సహకారంతో వివిధ రకాల 300 మామిడిమొక్కలు నాటినట్లు ఆలయ ఈవో మానికల రాంబాబు తెలిపారు.

మమ్మల్ని ఆపేదెవడ్రా..

- మట్టి అక్రమ రవాణాకు అడ్డాగా దిప్పకాయలపాడు రాజు చెరువు
- ఇష్టానుసారంగా మట్టి తోలకాలు సాగిస్తున్న అక్రమార్కులు



దిప్పకాయలపాడు రాజు చెరువులో నిర్వహిస్తున్న మట్టి తోలకాలు

కొయ్యలగూడెం: మట్టి అక్రమ రవాణాకు దిప్పకాయలపాడు రాజు చెరువు అడ్డాగా మారింది. చెరువు గర్భంలో సైతం అక్రమార్కులు ఇష్టానుసారంగా తవ్వేస్తున్నారు. స్థానిక ప్రజాప్రతినిధి అండదండలు ఉండడంతో అక్రమార్కులు అడ్డూ అదుపూ లేకుండా మట్టి తవ్వకాలు యథేచ్ఛగా సాగిస్తున్నారు. ప్రభుత్వం మాది.. ఏం చేసినా మమ్మల్ని ఎవరాపుతారు.. అనే ధీమా అక్రమార్కుల్లో కన్పిస్తోంది. తాము ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేస్తుంటే మట్టితోలకాలకు అనుమతులు ఉన్నాయని చెబుతున్నారని, కానీ మార్కింగ్ ఇవ్వకపోవడంతో ఇష్టానుసారంగా మట్టితోలకాలు చేస్తున్నారని, దీంతో భారీ గోతులు ఏర్పడుతున్నాయని ఆయకట్టు రైతులు అంటున్నారు. ముఖ్యంగా చెరువు గట్టు తవ్వి ట్రక్కుల రాకపోకలకు అనువుగా చేసుకున్నారని, దీనివల్ల వర్షాలు కురిస్తే చెరువులో చుక్క నీరు లేకుండా పోతుందని వాపోతున్నారు. ఈ మట్టిని వ్యవసాయ అవసరాలకు కాకుండా కమర్షియల్ కార్యకలాపాలకు వినియోగిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

చెరువు గట్టు సైతం ధ్వంసం

రాజు చెరువు గట్టులో ఇప్పటికే నీరు లేకుండా పోయిందని, పలుచోట్ల ఇష్టానుసారంగా తవ్వడం వలన పొలాలకు సాగునీరు అందకుండా పోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా ఈ చెరువు గట్టు కొయ్యలగూడెం, కన్నాపురం ప్రధాన రహదారికి ఆనుకుని ఉందని, చెరువు గట్టును ధ్వంసం చేయడం వలన వరదల సమయంలో రోడ్డు ముంపునకి గురై రాకపోకలు స్తంభిస్తున్నాయని ప్రజలు పేర్కొంటున్నారు. రాజు చెరువు ఇప్పటికే వివాదాస్పదంగా మారిందని రైతుల అవసరాలకు మట్టితోలకాల కోసం అనుమతులు అడుగుతుంటే భారీ స్థాయిలో మామూళ్లు ఇచ్చుకోవాల్సి వస్తుందని, అదే కమర్షియల్ అవసరాలకు అయితే ఆగమేఘాలపై అనుమతులు లభిస్తున్నాయంటూ పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు ఇమ్మని శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ విషయం ఇరిగేషన్ ఏఈ దృష్టికి తీసుకువెళ్లగా సిబ్బంది కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, దాని వలన పూర్తిస్థాయిలో మట్టి అక్రమ రవాణాపై దృష్టి పెట్టలేకపోతున్నామని పేర్కొనడం గమనార్హం.

గిట్టుబాటు ధర కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రవి

టి.నరసాపురం: పొగాకు పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. అనుబోలు మురళి అధ్యక్షతన జరిగిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో రవి మాట్లాడారు. పొగాకు కొనుగోలు చేయకుండా సిండికేట్‌గా రైతులకు నష్టం చేకూర్చే విధంగా కొనుగోలు కేంద్రాల్లో దళారులు వ్యవహరిస్తున్నారన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని పొగాకు రైతుకు గిట్టుబాటు ధరలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఆర్ పార్టీ కార్యదర్శి మడకం సుధారాణి, పార్టీ మండల కమిటీ సభ్యులు మడకం కుమారి, బరగడ కుమారి, ముంద్రు శిరీష, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత ద్వారా దోమల నివారణ

చింతలపూడి : పరిసరాల శుభ్రత ద్వారా దోమల నివారణ చేపట్టవచ్చునని చింతలపూడి మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎస్ఏ ప్రసాద్ సూచించారు. శనివారం స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహంలో మలాథియాన్ స్ప్రేయింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతలపూడి మలేరియా సబ్ యూనిట్ పరిధిలోని 18 ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో కీటక జనిత వ్యాధులకు గురికాకుండా ముందస్తు చర్యల్లో భాగంగా మలాథియాన్ ద్రావణం పిచికారి చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం తొలకరి వర్షాలు ప్రారంభమైన నేపథ్యంలో ప్రతి ఒక్కరూ దోమల నియంత్రణ చేపట్టాలన్నారు. ఇంటి పరిసరాల్లో మురుగు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో వసతి గృహ అధికారులు, మలేరియా హెల్త్ అసిస్టెంట్ కె శ్రీనివాస్, ఎమ్ఎల్‌హెచ్‌పీలు, వీహెచ్‌ఎస్‌లు పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దార్ ప్రియదర్శినికి సత్కారం

దెందులూరు: అంకిత భావంతో ఏ రంగంలో గుర్తింపు వస్తుందని దెందులూరు తహసీల్దార్ బి.సుమతి అన్నారు. శనివారం దెందులూరు తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తూ ఏలూరు రూరల్ మండలం తహసీల్దార్‌గా బదిలీపై వెళ్తున్న ప్రియదర్శిని రెవెన్యూ అధికారులు ఘనంగా సత్కరించారు. జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ప్రియదర్శిని మాట్లాడుతూ దెందులూరు మండలం తన సొంత మండలంగా భావిస్తున్నానని దెందులూరుతో తన బంధం విడదీయరానిది అన్నారు. తనకు పూర్తి సహాయ సహకారాలు ప్రోత్సాహం అందించిన అధికారులు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.